# ఆడిపాడిన ఇల్లు

**వాస్తవాలకన్నా స్మృతులే మధురంగా ఉంటాయి. నిజం.వాటిలోంచి వాస్తవంలోకి రావడం ఎంత బాధాకరమో!**

ఆప్పూఘర్ దాటి స్కూటర్ భీమ్లి రోడ్డు వైపు వెళుతోంది. ఎడమవేపు కొండ. దానిపై పచ్చదనాన్ని సంతరించుకుంటున్న చెట్లు. కుడివేపు సువిశాలంగా పరచుకున్న సముద్రం.

నీలంగా, వూదాగా, తెల్లగా, పచ్చగా - అబ్బో ఈ సాగర సౌందర్యదేవత ఎన్నో రూపాల మనసుని ఆరాటపెడుతోంది.

రాజు నడుం చుట్టూ చేతులేసి నిశ్చింతగా స్కూటర్ వెనుక సీట్‌పై కూర్చుని పరిసరాల అందాలని చూస్తూంది నిర్మల.

వేగంగా వెళుతున్న స్కూటర్‌కి లారీలు, సిటీ బస్సులు, కార్లు, జీపులు ఎదురొస్తున్నాయి. భీమ్లి వేపు ఐస్‌క్రీమ్ బండిని తోసుకుంటూ వెళుతున్న కుర్రాడిని చూసి "ఇలా ఎక్కడివరకు తీసుకెళతాడో? అవి అమ్మితే ఎంతొస్తుందో? దానిమీదెంతమంది బతకాలో?" జాలిపడ్డాడు రాజు.

భీమ్లి వెళుతున్న ఆనందంలో ఉందేమో నిర్మల ఐస్‌క్రీమ్ కావాలని అడగలేదు.

రాజు స్కూటర్ ఆపాడు. ఆమె దిగి చుట్టూ చూసింది. సముద్రపు అలల హోరు తప్ప మానవపరమైన సవ్వడులేవీ లేని ఆ ప్రదేశంలో అక్కడక్కడ కట్టిన ఇళ్ళు దర్శనమిచ్చాయి. "ఇక్కడితో విశాఖ ఆఖరు. ఇక్కడ్నుంచి భీమ్లి మొదలు. ఇదిగో ఈ స్థలం నాది." మైలు రాయిని చూపిస్తూ అన్నాడు రాజు. విశాఖ అతని స్థలంతో ఆఖరవుతుంది. అక్కడి నుంచి భీమ్లి మొదలవుతుంది. ఆమె ఆశ్చర్యంగా ఆ స్థలాన్ని చూస్తూ సంబరంగా స్థలంలోకి పరిగెత్తింది. రాళ్ళు తగుల్తున్నా ముళ్ళకంపలు గీరుకున్నా లెక్కలేనితనంగా అటు ఇటు హడావిడిగా తిరిగింది. స్థలం వెనుక అక్కడక్కడా గుంపుగా సరుగుడు చెట్లు. ఇసుక. సముద్రం.

"ఇక్కడో చిన్న ఇల్లు కట్టుకోవాలి. ఎంచక్కా రోజూ సముద్రం మీదకి తెప్పపై వెళ్ళొచ్చు" అన్నాడతను.

"ఢిల్లీ వదిలి మనం ఇక్కడికి వస్తే భీమ్లి ఇంట్లోనే ఉండాలి." కచ్చితంగా చెప్పేసిందామె.

అతను నవ్వుతూ "ఆ ఇల్లు అంత బాగుంటుందా?" అడిగాడు.

"నువ్వే చూస్తావ్‌గా" అంటూ స్కూటర్ ఎక్కింది.

ఎఱ్ఱమట్టిదిబ్బలు.

భీమ్లిలో ఓసారి ఊరువూరంతా ఎఱ్ఱమట్టిదిబ్బల వేపు ఉరకలపరుగులపై కదిలారు. విశాఖలో చదివే పిల్లలు జంటలు జంటలుగానో, గుంపులు గుంపులుగానో భీమ్లి సముద్రతీరానికి రావడం సర్వసాధారణం. అలా వచ్చిన జంటలోని ఓ కుర్రాడు దురదృష్టవశాత్తూ వర్షంలో తడిసిన ఎఱ్ఱమట్టిదిబ్బలో కాలువేయడం, ఆ మట్టిదిబ్బ అతడిని తనలోకి లాక్కోవడం క్షణంలో జరిగింది. ఆ యువతి హాహాకారాలతో భీమ్లి ప్రతిధ్వనించింది. ఆ అమ్మాయి కన్నీటితో మరో సముద్రాన్ని సృష్టించింది. పావం ఇప్పుడామేం చేస్తూందో? అతన్ని తలచుకుంటూ మరొకర్ని జీవితంలోకి ఆహ్వానించలేదా లేక అతడినే జ్ఞాపకంగా మిగుల్చుకొని కొత్త జీవితం ప్రారంభించిందా? అసలు రెండింటిలో ఏది మంచిది?

మనిషిని సజీవంగా ఉంచేది, జీవితాన్ని ఉత్సాహంగా నడిపించేది ఏదైనా ఉత్తమమైనదే.

"ఇదేనా భీమ్లి?" అడిగాడతను.

జ్ఞాపకాల నుంచి వెలుపలికి వస్తూ "ఆఁ. ఇదిగో ఇదే నర్సింహస్వామి కొండ. ఈ కొండపైనే భీముడు రాక్షసుణ్ణి చంపాడు. అందుకే ఈ ఊరికి భీముని పట్నం అని పేరొచ్చింది. పైకి వెళదామా?" చంటిపిల్లాడికి వివరించినట్లు చెప్పిందామె. స్కూటర్ ఆపి ఆ ఎండలో మెట్లెక్కి కొండపైకి వెళ్ళారు.

"రోజూ ఉదయం ఈ కొండకి వచ్చేదాన్ని" నిద్రగన్నేరు చెట్టుని చూస్తూ చెప్పిందామె.

"చిన్నప్పుడంత భక్తా?"

"అబ్బెబ్బే. ఇవిగో ఈ పూల కోసం." రాలిన నిద్రగన్నేరు పూలని ఏరుతూ అందామె.

"ఇంకా పైకి వెళితే కొలను ఉంటుంది. దాన్ని సీతమ్మ కొలనో, ద్రౌపది చెరువో అంటారండి." పరిశోధనా వేత్తలా కనుబొమలు ముడుస్తూ అందామె.

"ఇప్పుడక్కడికి వెళ్ళాలా?" నుదుటిపై కారుతున్న చెమటని తుడుచుకుంటూ భయంగా అడిగాడు.

"సాయంత్రం వెళదాంలేండి." కన్రెప్పలు ఆర్పుతూ వరమిచ్చిన దేవతలా అందామె. ఇద్దరూ కిందకి వచ్చారు.

"మీ ఇల్లెక్కడ?"

"కాస్త ఊరంతా తిరిగి వెళదాం. ఇంట్లోకి వెళితే బయటకి రావాలనిపించదు." అందామె.

"అసలు నువ్వు ఇల్లు గుర్తుపట్టగలవా?" అనుమానంగా అడిగాడు.

"భలేవాడివే. పుట్టింది విశాఖైనా, మూడు రోజుల పాపాయిగా పెరగడం మొదలుపెట్టిందిక్కడే." అందామె.

"ఎన్నేళ్ళొచ్చేవరకూ ఇక్కడున్నావు?"

"పదేళ్ళు. నాన్నగారికి ఢిల్లీలో ఉద్యోగమైనా నేనిక్కడే అమ్మమ్మ దగ్గర పెరిగాను. నాకు పదేళ్ళుండగా తాతగారు పోయారు. అమ్మమ్మ ఎవ్వరి దగ్గర ఉండడానికీ ఇష్టపడలేదు. ఇంటిని ఎవరో దూరపు బంధువులకు అమ్మేసి అమ్మమ్మ మధుర వెళ్ళిపోయింది. నేనీ ఊరు విడిచివెళ్ళనన్నా ఢిల్లీ పంపించేసింది అమ్మమ్మ. నువ్వు అందంగా ఉన్నావనో, ఇంజనీర్‌వనో ప్రేమించలేదు. విశాఖ అబ్బాయివని." గొప్ప రహస్యం చెవుతున్నట్లు అందామె.

"ఇలా ఎండలో భీమ్లంతా తిప్పుతావని తెలిస్తే నన్ను నువ్వెంత ప్రేమించినా పెళ్ళి చేసుకునేవాణ్ణి కాదు." అన్నాడతను.

"భీమ్లి గురించి నీకేం తెల్సు. ఆఁ ఆగాగు. ఇదిగో ఇదే గంటస్తంభం. ఇదేంటి ఇంతలా మారిపోయిందంతా. అప్పట్లో ఇంత ఇరుగ్గా ఉండేది కాదు. అసలీ ఊర్లో సినిమాహాల్స్ ఉండేవే కాదు. అయ్యో ఊరంతా ఇరుగ్గా ఏంటోలా అయిపోయింది." దిగులుగా అందామె. "ఆ ఎదుట సందులోకి వెళ్ళండి. ఆఁ. ఆఁ... ఇదే నేను చిన్నప్పుడు చదివిన స్కూలు. నాకోసారి క్లాసులో 'మోస్ట్ సైలెంట్ గర్ల్' అనే అవార్డు వచ్చింది. ఓ సోప్ బాక్స్ ఇచ్చారు." పూర్తిగా మారిపోయిన పాఠశాల భవనాన్ని చూస్తూ చెప్పిందామె.

"నీకా?" గలగల మాట్లాడుతున్న ఆమె వేపు అనుమానంగా చూస్తూ అడిగాడు.

"నాకే. చిన్నప్పుడు. పెద్దయ్యాక కాలేజీలో మోస్ట్ యాక్టివ్ స్టూడెంట్ అని ఇచ్చార్లేండి. అసలు విషయం ఏమిటంటే, ఏయే ప్రైజులున్నాయో చూసుకొని నేనలా మారిపోతుంటానన్నమాట. ఇంతకీ మీకేమైనా ప్రైజ్‌లొచ్చాయా?" అడిగిందామె.

"ఆఁ. 'జంటిల్‌మేన్ ఆఫ్ ది బ్లాక్' అని ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు హాస్టల్లోవాళ్ళిచ్చారు." చెప్పాడు.

"నిజంగా మీరు జంటిల్‌మేనే. ఇదిగో ఇదే రౌండ్ బంగళా. మరో చరిత్రలో 'బాలు, స్వప్న' అని రాసుకుందిక్కడే. విశాఖ రచయితలు చాలామంది ఇక్కడ కూర్చుని నాటకాలు కూడా రాశారు. ఇది నిజానికి డచ్చివారి బంగళా. వారి వారసత్వం, జ్ఞాపకాలు" అంటూ ఇసుకలోకి పరుగెత్తింది. అతనామె వెనుక నడిచాడు.

"ఇవే చలంగారు ముచ్చటపడిన సముద్రపు రాళ్ళు" టూరిస్ట్ గైడ్‌లా అందామె.

"ఆఁహాఁ" అన్నాడతను.

"నిజంగా ఇవే" అంటూ కాస్త ముందుకు వెళ్ళగానే ఇంకాస్త ఉన్నతంగా నున్నగా నిగనిగలాడుతూ నీలి కెరటాలతో ఆడుకుంటున్న పాత రాళ్ళు కనిపించగానే వాటి వంక అనుమానంగా చూస్తూ, "రాజా, చలంగారికి ఇష్టమైన రాళ్ళు అవి కావు. ఇవీ. ఇందాక పొరపాటు పడ్డాను" అందామె.

అతను అయోమయంగా చూస్తూ, "నాకా తెలియదు. నువ్వేం చెపితే అవే అనుకోవాలి" అంటూ నవ్వాడు.

"మా బుజ్జివి కదా. నిజంగా ఇవే" అంటూ నమ్మమని అతని గడ్డం పట్టుకుని బతిమాలింది.

"సరిసరే. మీ ఇల్లు?" అన్నాడతను నీరసంగా.

"అదిగో ఆ కనిపించే వీధిలోనే" అందామె.

"బతికించావ్. ఇంకెక్కడెక్కడ తిప్పుతావోనని భయపడ్డా."

పసితనపు గుండెల్లో చెదరని, తరగని ఆకర్షణని నింపిన భీమ్లి జలసౌందర్యపు వింత సోయగాలు, కెరటాల మార్దవపు కేళీవిలాసం, అలల లేతదనం, తెల్లని నురుగు యౌవనం, గాలిలో మెరుపు, మరే సముద్రంలోనూ కనిపించని సుకుమార గాంభీర్యం గుండెల నిండా నింపుకొని ఆమె తన ఇంటివేపు కదిలింది.

ఎర్ర పోస్ట్ బాక్స్ - ఎత్తరుగుల ఇల్లు. ఇదే ఇల్లు. ఇక్కడే ఈ ఇంటి ప్రాంగణంలోనే పాకింది. అడుగులేసింది. అక్షరాలు దిద్దింది.

''ఇదేనా మీ ఇల్లు.'' అడిగాడతను.

''ఆఁ ఇ...దే... ఇదే.'' ఉద్వేగంగా ఇంట్లోకి ప్రవేశించిందామె.

అతనూ ఇంట్లోకి వెళ్ళాడు.

''ఇది కచ్చేరీ గది. ఈ గోడలపై చూడు. గాంధీ, నెహ్రూ, పటేల్, మోతీలాల్, సరోజినీ నాయుడు, ఇందిరా గాంధీల ఫోటోలు. తాతగారు గాంధేయవాది. ఇదిగో రాట్నం. ఆయనకు కాంగ్రెస్ పార్టీ అంటే బోల్డంత గౌరవం, భక్తి. ఇదిగో ఈ చూరు నుంచి ఎండవేళ సూరీడు, వెన్నెల వేళ జాబిల్లి, అప్పుడప్పుడు వానదేవుడు ప్రత్యక్షమయ్యేవారు. ఇది మా అమ్మ గది. కుడివేపు ఇదిగో సరిగ్గా చూడు. మా అమ్మ చిన్నప్పటి ఫోటో.

ఇది హాలు. చూశావా ఇక్కడ్నుంచి సముద్రం ఎంత స్పష్టంగా కనిపిస్తుందో. ఇటు చూడు, ఇంటికీ సముద్రానికి ప్రహరీ గోడ మాత్రమే అడ్డుకదా. ప్రైవేట్ మాస్టార్ని తప్పించుకోడానికి ఈ గోడెక్కి దూకేదాన్ని. ఈ బావి దగ్గర తేలేదాన్ని. ఇక్కడ్నుంచి బీచ్‌కి ఒకటే పరుగు. ఆ నీళ్ళలో ఆటలు. జాలరివాళ్ళతో పడవ ప్రయాణం. ఇదిగో ఇది దేవుడి గది. ఆ మూల పాలవెల్లి. ఈ మూల బీరువాలో మట్టి హుండి ఉంటే అందులో డబ్బులు దాచేదాన్ని. అది నా కిడ్డీ బ్యాంక్. ఇది వంటిల్లు. ఇది బాత్రూమ్.'' ఉద్వేగంగా చెపుతున్న ఆమె ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది.

పెచ్చులూడిపోయిన స్తంభాన్ని చూస్తూ ''నాకు ఏడో ఎక్కం ఎంత చదివినా అప్పచెప్పటం వచ్చేది కాదు. తాతగారికి కోపం వచ్చి ఈ స్తంభానికి తాడేసి కట్టేశారు. ఎక్కం అప్పచెపితేనే తాడు విప్పుతానన్నారు. అయినా నాకు ఎక్కం రాలేదు. భయపెడితే మాత్రం రాని చదువొస్తుందా'' అందామె.

హఠాత్తుగా ఏదో గుర్తొచ్చినట్లు అక్కడ్నుంచి కచ్చేరీ గది పక్కనున్న భాగం వేపు పరిగెత్తిందామె.

''ఇదే నా ఆట రూమ్. ఆ దూలానికే ఊయల కట్టి బొమ్మపావల్ని ఊపేదాన్ని'' ఆనందోద్వేగాలు పోటీపడుతుంటే వివరిస్తోందామె.

రాజు ఆమె వేపు భయంభయంగా చూస్తున్నాడు. ఎంతటి ఉద్వేగం. 'ఆట రూమ్' అనడంలోనే తెలుస్తోంది ఆమెలో ఉద్వేగపు హోరు. ఎక్కడ ఢిల్లీ! ఎక్కడ భీమ్లి! పెళ్ళయ్యాక ఎక్కడికైనా వెళదామా అంటే, 'భీమ్లి' అందామె. ఇల్లంతా హడావిడిగా తిరుగుతున్న ఆమెని చూసి ''ఇంక వెళదామా.'' అడిగాడతను.

ఆ మాటలకి లోతైన ధ్యానంలోంచి వెలుపలికి వస్తున్నట్లు అతని వేపు చూసింది. చుట్టూ చూసింది. తిరిగి మళ్ళీ మళ్ళీ చూసింది. నిశ్చేష్టురాలై చూస్తూందామె. అతనూ ఆ ఇంటినే చూస్తున్నాడు.

పురాతనమైన బిళ్ళ పెంకుటిల్లు. ఓ వేపు పూర్తిగా కూలిపోయింది. మరో వేపు నగం వొరిగిపోయింది. ఆమె అచేతనంగా చూస్తూంది. బాల్యస్మృతుల దివ్యకాంతుల సౌధం - ఇదేంటిలా శిథిలశకలాలతో కనిపిస్తోంది.

ఆ ఇంటికి కొత్తదో పాతదో ఏదో ఒక రూపం ఉండి, తలుపులుండి, మనుమలుంటే ఆమె ఎలా రియాక్ట్ అయ్యేదో కాని, అసలక్కడ ద్వారబంధాలు, గోడలు, తలుపులు కాదు, ఇల్లే లేదు. ఉన్నదంతా కూలిపోయిన గోడలు - ముక్కలైపోయిన పెంకులు. ఇల్లు కుప్పకూలిపోయిందనే లేకుండా మస్తిష్కంలో ముద్రించుకుపోయిన ఆ ఇంటి ఆనవాళ్ళు, జ్ఞాపకాలు అనుభవాలు సజీవంగా గుండెల్లో కదుల్తుంటే ఆ ఇంట్లో అంగుళం అంగుళంలో ఏముండేవో అవి ఇప్పుడక్కడున్నట్లే, అక్కడ కనిపిస్తున్నట్లే వివరిస్తున్న ఆమెని ఆందోళనగా చూస్తున్నాడతను. నూతిని ఆనుకొని ఉన్న ఇంట్లో ఇద్దరు స్త్రీలు వీళ్ళిద్దర్నీ వింతగా చూస్తున్నారు.

నిర్మలని మనుమల్లోకి తీసుకురావాలని ''ఎవరు వాళ్ళు?'' అడిగాడు రాజు.

చిత్రాలు: నర్సిం



సముద్రపు అలల
హోరు తప్ప
మానవపరమైన
సవ్వడులేవీ లేని
ఆ ప్రదేశంలో అటు ఇటు
హడావిడిగా తిరిగింది.

నిర్మల మెల్లగా తలతిప్పి అతను చూస్తున్న వేపు చూసి, మెల్లగా అటు వేపు నడిచి, "ఇది పూజారిగారిల్లు కదండీ" అనడిగింది.

"అవునమ్మా" అందో స్త్రీ.

"పూజారిగారు లేరాండి." అడిగింది నిర్మల.

"తగరవలస పని మీద వెళ్ళారు. మీరెవరు?" సందేహంగా అడిగిందామె.

"పోస్టుమాస్టారు ఉండేవారుగా ఈ ఇంట్లో. గుర్తున్నారా? ఆయన మనవరాలినండి" అంది నిర్మల.

"అంటే, ఇందుబాబు కూతురివా." ఆశ్చర్యంగా అడిగిందామె.

"అవునండి. ఈ ఇల్లిలా అయిపోయిందేంటండి." ఆతృతగా దుఃఖంతో అడిగింది నిర్మల.

"ఇంటిని కొనుక్కున్నవాళ్ళబ్బాయికి వ్యాపారంలో బాగా కలిసొచ్చింది. విశాఖలో ఇల్లు కట్టుకున్నారు. అక్కడైతే అన్ని సరదాలు, హంగులు, దర్జాలు, సుఖాలుంటాయని అంతా విశాఖే వెళ్ళిపోయారు. ఆలనా పాలనా లేక ఆ ఇల్లలా అయిపోయింది." పూజారి శ్రీమతి చెప్పింది.

ఆ మాటలు వింటుంటే నిర్మల గుండెల్లో బాధ సుళ్ళు తిరిగింది.

పాతింటిపై ఎంత నిర్లక్ష్యమో!

అలా అనుకోడానికి వీల్లేదు కదా. కొనుక్కున్న వాళ్ళకి ఇంటితో ఏ విధమైన అనుబంధం ఉండకపోవచ్చు. అప్పట్లో తక్కువ ధరకి వచ్చిందని కొనుక్కొని ఉండొచ్చు. ఎక్కువ ధర వచ్చాక అమ్ముకోవచ్చు. లేక కొన్నాళ్ళు పోయాక మరో ఇల్లు కట్టుకోవచ్చు. వాళ్ళు బాధపడడానికో, ఈ ఇంటిని లక్ష్యపెట్టడానికో వాళ్ళకి ఈ ఇల్లు ఇచ్చిన జ్ఞాపకాలు లేవేమో!

ఆమె కళ్ళ నిండా నీళ్ళు. బాల్యస్మృతి ఓ సజీవ చిత్రమై ఇంటి రూపంలో పదిలంగా ఉందనే నమ్మకం గుండెల్లో జ్ఞాపకాలకి నిలయమై ఆలయమైన ఇల్లు ఇలా కూలిపోయి శిథిలమై, శకలమై కంటి ముందు కనిపిస్తుంటే ఆమె హృదయం శోకిస్తూంది.

'ఎందుకొచ్చానిక్కడికి? నిండైన ఆ ఇల్లు అలాగే గుండెల్లో సజీవంగా ఉండేది కదా' అనుకుంటూ, "వెళదామా" అందామె.

అతని మనసు విలవిలలాడింది.

నిర్మల ఆడి పాడిన ఇల్లు. చిన్నప్పుడు తిరిగిన ఇల్లు. పసితనపు మైమరపు రాగాలు పల్లవించిన చోటిది. సొంత ఊరు - సొంత ఇల్లు - సొంత పొలం వినటానికే ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. అవి అలా చివరివరకు మిగిల్తే ఇంకెంతో బాగుంటుంది. పొట్ట చేత పట్టుకొని దేశమేంటి, ప్రపంచమంతా తిరిగే మానవునికి కొన్నాళ్ళకి సొంత దేశం కూడా ఉండదా? ఏమో! ఎవరికి తెలుసు.

"ఈ ఇల్లు అమ్ముతాననేమైనా అన్నారాండి." అడిగాడతను.

"అమ్మేస్తారంట. ఉండండి. అడ్రస్ ఇస్తాను." లోపలికి వెళ్ళింది పూజారి శ్రీమతి.

"ఎందుకు?" అడిగింది నిర్మల.

"కొందాం."

"ఎందుకు?"

'నీకిష్టంగా" అన్నాడతను.


ఆమె మనసు ఉప్పొంగిన సముద్రమైంది - తన ఇష్టంపై రాజుకి ఉన్న ప్రేమ చూసి.

"మన దగ్గర డబ్బు లేదుగా" అంది నిర్మల.

"విశాఖలో స్థలం అమ్మేద్దాం."

"విశాఖ - భీమ్లి రోడ్డులోదా." అనుమానంగా అడిగిందామె.

"ఆఁ."



నేలను చదును చేసి కొత్త గోడలు లేపి పెంకుటిల్లో, మేడో కట్టొచ్చు. కానీ, అది ఆనాటి ఇల్లవదుగా. బాల్యస్మృతుల ఆనవాలు దొరకని ఆ ఇల్లెందుకు?

"అదేంటి వద్దు. అది నీకిష్టంగా" అందామె.

"ఇష్టమే తప్ప జ్ఞాపకాలు, అనుభూతులు లేవుగా. వద్దనకు. డబ్బుకి కాస్త కష్టమైనా ఈ ఇల్లు తప్పక కొందాం" అన్నాడు రాజు.

పూజారి శ్రీమతి ఇచ్చిన అడ్రస్ కాగితాన్ని విప్పి చూడనైనా చూడకుండా గుప్పిలి బిగించి స్కూటర్ ఎక్కిందామె.

నేలను చదును చేసి, కొత్త పునాదులేసి, కొత్త గోడలు లేపి పెంకుటిల్లో, మూడంతస్తుల మేడో కట్టొచ్చు. కా...ని.....కానీ అది ఆనాటి ఇల్లవదుగా. ఆనాటి బాల్యస్మృతుల ఆనవాలు దొరకని ఆ ఇల్లెందుకు?

ఆమె గుప్పిలి విప్పింది.

చిరునామా కాగితం ఎగిరిపోయింది. ■